క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.3 లక్షల విరాళం



దాత విష్ణువర్ధన దేవికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముగ్గురు భక్తులు వేర్వేరుగా శనివారం రూ. 3,00,232 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా దెందులూరుకు చెందిన కొడాలి విష్ణువర్ధన దేవి రూ.1,00,116, భీమడోలుకు చెందిన దాసరి శోభనాద్రి రూ.1,00,116, హైదరాబాద్‌కు చెందిన జి.సూర్యనారాయణ రాజు రూ.1,00,000 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాలను అందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

26న చండీహోమం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 26వ తేదీన చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆరోజు సాయంత్రం 4 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, రాత్రి 8 గంటలకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామన్నారు. చండీహోమంలో పాల్గొనదలచిన వారు ముందుగా ఆలయ కమిటీని సంప్రదించాలని, అన్నప్రసాదం స్వీకరించాలనుకునే వారు ఆలయంలో టోకెన్ తీసుకోవాలన్నారు.

భక్తులతో పోటెత్తిన పారిజాతగిరి



పారిజాతగిరివాసుడిని దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. సంక్రాంతి సెలవులు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర పూజలు జరిపారు. భక్తులు స్వామివారి కొండపైకి కాలినడకన పాదయాత్రగా చేరి స్వామివారిని దర్శించుకున్నారు అన్నప్రసాద వితరణ దాతలనుఆలయ ఈవో, అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు, వేద ఆశీస్సులతో సత్కరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగప్రసాద్ స్వామివారిని దర్శించుకున్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



దిప్పకాయలపాడులో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రక్తదాన శిబిరాలు విరివిగా నిర్వహిస్తూ దాతలు ప్రాణదాతలు కావాలని, అందుకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది పేర్కొన్నారు. దిప్పకాయలపాడులో శనివారం కొయ్యలగూడెం మానవత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన అధ్యక్ష కార్యదర్శులు మాటూరు సుధీర్, కంభంపాటి సాయితో కలసి ప్రారంభించారు. ఉచిత రక్తదాన శిబిరంలో సుమారు ముప్పై మంది పాల్గొని 30 యూనిట్ల రక్తాన్ని విజయవాడకు చెందిన ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. రైతు ప్రతినిధులు గెడా గెరటయ్యబాబు, గెడా సుబ్బారావు, కాకర్ల శేషు, సిద్దు అలీషా, మానవత సభ్యులు ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, నిడదవోలు రామారావు, జి.మోహన్‌రావు, జనార్దనరావు, చంటి, గాంధీ, వీఎస్ఎన్ స్వామి, ఎస్‌బీజీ శేఖర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

ఉంగుటూరు: కాగుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002–2003 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం అదే పాఠశాలలో నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు పలువురు హాజరై పరస్పరం యోగ క్షేమాలను తెలుసుకున్నారు. చిన్నప్పటి జ్ఞాపకాలు, ఆనాటి తరగతిలో విశేషాలను ఒకరికొకరు జ్ఞాపకం చేసుకుంటూ సరదాగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. గణేష్, కిషోర్, దుర్గాప్రసాద్, ఝాన్సీ, శిరీష పాల్గొన్నారు.

వైట్ బార్లీ పొగాకు సాగుపై ఆసక్తి

- గతేడాది కంటే పెరిగిన పంట విస్తీర్ణం
- గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తున్న రైతులు



పాలకుంటలో వైట్ బార్లీ పంటను ఆరబెడుతున్న గిరిజన రైతు



వైట్ బార్లీ పంటను అల్లుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో వర్జీనియా పొగాకుతోపాటు వైట్ బార్లీ పొగాకు పంటను కూడా రైతులు అధికంగా పండిస్తున్నారు. గత ఏడాది వైట్ బార్లీ పంటకు ధర అధికంగా రావడంతో ఈ ఏడాది రైతులు వైట్ బార్లీ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపారు. ఐటీసీ కంపెనీ గతేడాది వైట్ బార్లీకి కేజీ రూ.115 ధర నిర్ణయించగా రూ.35 ధర పెంచి కేజీ రూ.150కు కొనుగోలు చేశారు. దీనితో రైతులు ఈ ఏడాది పోలవరం నియోజకవర్గంలోని గిరిజన మండలాల్లో అధికంగా వైట్ బార్లీ పంటను వేశారు. ఈ ప్రాంతంలో వరి, ప్రత్తి, వేరుశనగ, మొక్కజొన్న, పంటల తర్వాత అత్యధికంగా వర్జీనియా పొగాకు పంటను రైతులు పండిస్తారు. అయితే గత రెండేళ్లుగా వైట్ బార్లీ పొగాకు పంటకు ధర కూడా పెరగడంతో ఈ పంటను పండించడమే ఉత్తమమని రైతులు భావిస్తున్నారు.

ఈ ఏడాది 1800 ఎకరాల్లో సాగు

పోలవరం, బుట్టాయగూడెం, కూనవరం, అశ్వారావుపేట, తదితర గ్రామాల్లో గతేడాది 1200 ఎకరాల్లో రైతులు వైట్ బార్లీ పొగాకు పంటను పండించినట్లు ఐటీసీ అధికారులు తెలిపారు. అయితే ఈ ఏడాది రైతులు ఎక్కువగా ఆసక్తిగా చూపడంతో సాగు విస్తీర్ణం పెరిగిందని చెబుతున్నారు. ఆయా గ్రామాల్లో సుమారు 1800 ఎకరాల్లో వైట్ బార్లీ పొగాకు పంటను సుమారు 800 మంది రైతులు సాగు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు.

గిట్టుబాటు దక్కేనా

గత ఏడాది రైతులు ఊహించని విధంగా వైట్ బార్లీ పంటకు రూ.35 ధర పెరిగి కేజీ రూ.150 అధికారులు పొగాకును కొనుగోలు చేయడంతో ఈ ఏడాది కూడా పంటకు గిట్టుబాటు ధర వస్తుందని రైతులు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే వైట్ బార్లీకి సంబంధించి రైతులు పొగాకు ఆకును కొట్టి కట్టలుగా అల్లి గుడారాల్లో ఆరబెడుతున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో దిగుబడి కూడా అధికంగా ఉందని మంచి ధర వస్తుందని రైతులు ఆశ పడుతున్నారు. అలాగే కంపెనీలు తమను ప్రోత్సహిస్తే వైట్ బార్లీ పంటను మరింత ఎక్కువ సాగు చేసి అధిక దిగుబడులు సాగు చేస్తామని రైతులు చెబుతున్నారు.

పరిసరాల శుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలి

- జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి
- చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్



చింతలపూడి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



లింగపాలెం: విద్యాశాఖ ఆధ్వర్యంలో చెత్తను శుభ్రం చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే చుట్టూ ఉన్న పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం కోర్టు ఆవరణలో మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ లక్ష్యమని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ కె.స్లీవజోజి, కమిషనర్ రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరసరాల శుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో రాజు, కౌన్సిలర్ నంబూరు రామచంద్రరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు, బత్తిన చిన్న, ఎల్‌వీఆర్, అచ్చిరాజు, వీఆర్‌వోలు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సచివాలయం సెక్రటరీలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో...

చింతలపూడి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో పరిసరాలను శుభ్రం చేశారు. కళాశాల సమీపంలోని బస్టాప్‌ను శుభ్రపరిచి, రోడ్డుకిరుపక్కలా చెట్లను నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, భవిష్యత్ తరాల సంరక్షణకు మొక్కలు నాటడం ఒక్కటే మార్గమని అన్నారు. పచ్చదనం, పరిశుభ్రత వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగపాలెంలో...

లింగపాలెం: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక విద్యావనరుల కేంద్రం ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. ఎంఈవో కంటా రామారావు మాట్లాడుతూ మండలంలోని ప్రతి పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 జె.రవీంద్ర, సింగగూడెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బొర్ర శ్రీధర్, ఉపాధ్యాయులు సతీష్, ఏవీ బోస్, సీఆర్పీలు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో..

ద్వారకాతిరుమల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో పీవీవీ ప్రకాష్, ఈవోపీఆర్డీ ఏవీ సుబ్బారాయన్, సచివాలయ మహిళా పోలీస్ లక్ష్మీ సుజన, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణను, పరిసరాలను ఊడ్చి, శుభ్రం చేశారు. ఎంపీడీవో ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, అప్పుడూ రోగాలు దరిచేరవని అన్నారు. కాగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిమిత్తం మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సాయంత్రం ప్రజాప్రతినిధులు, అధికారులు రాజకీయ నాయకులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

కన్నాపురంలో...

కొయ్యలగూడెం: స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం కన్నాపురం పంచాయతీ పరిధిలో పారిశుధ్య అమలు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్, తహసీల్దార్ కె.చెల్లన్నదొరల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొని ప్రధాన వీధుల్లో ఉన్న చెత్తను స్వయంగా తొలగించారు. గణేష్ సెంటర్‌లో మానవహారం, ర్యాలీ నిర్వహించారు.

పోలవరంలో...

పోలవరం రూరల్: పోలవరంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్లు శుభ్రపరిచి రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని సర్పంచ్ పొడుం పుష్ప, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యంగా ఉండగలమని తెలిపారు. అనంతరం ఏటిగట్టు సెంటర్‌లో మానవహారం చేపట్టి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అందరూ కలిసి పనిచేయాలి



బుట్టాయగూడెంలో నిర్వహిస్తున్న ర్యాలీ

బుట్టాయగూడెం: పర్యావరణ పరిరక్షణలో సామాజిక భాగస్వామ్యం పెంపొందించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బుట్టాయగూడెంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, కరాటం సాయిబాబా, ఎంపీడీఓ కె. జ్యోతి, తహసీల్దార్ పీవీ చలపతిరావు, ఎస్సై దుర్గా మహేశ్వరరావు, ఏఓ ముత్యాలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం: కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ నిర్వహిస్తున్న దృశ్యం



పోలవరం: ఏటిగట్టు సెంటర్‌లో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ నిర్వహిస్తున్న దృశ్యం



కొయ్యలగూడెం: కన్నాపురంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తున్న మండల అధికారులు



ద్వారకాతిరుమల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణను శుభ్రం చేస్తున్న ఎంపీడీవో ప్రకాష్

మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న గోపాలపురం ఎమ్మెల్యే వెంకటరాజు

ద్వారకాతిరుమల: వచ్చే వేసవిలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బొండాడ మోహిని అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి అన్ని శాఖల మండల అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హౌసింగ్, ఎక్సైజ్, ఇరిగేషన్, ఐకేపీ శాఖల పనితీరుపై అధికారులను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

కన్నాపురం రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు



కొయ్యలగూడెం - కన్నాపురం రోడ్డులో ట్రాఫిక్ పరిస్థితి ఇలా

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం – కన్నాపురం ప్రధాన రహదారిలో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గణేష్ సెంటర్ మొదలుకొని మహాలక్ష్మి థియేటర్ వరకు సుమారు అర కిలోమీటర్ ఉన్న మెయిన్ రోడ్‌లో సాధారణ రోజుల్లో సైతం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. డ్రెయిన్ల ఆక్రమణ, దుకాణాల ఏర్పాటు, అదేవిధంగా దుకాణాల ముందే లోడింగ్, అన్ లోడింగ్ చేస్తున్న వాహనాల వలన ట్రాఫిక్ సమస్య ఏర్పడడానికి ప్రధాన కారణం అవుతున్నాయి. దీనివల్ల పోలవరం, బుట్టాయిగూడెం మండలాలనుంచి రాకపోకలు సాగించే ప్రజలు, ఉద్యోగులతో పాటు విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు, హాస్పిటల్స్‌కి వెళ్లే రోగులకు ఇక్కట్లు తప్పడం లేదని వాపోతున్నారు. ఒక్కోసారి అత్యవసర వాహనాలు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో గ్రామంలోని అంతర్గత రోడ్ల గుండా వెళ్లిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

హెల్మెట్ ధరించి వాహనం నడపండి



ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ పంపిణీ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి

చింతలపూడి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించి వాహనాలు నడపాలని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు సూచించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు స్థానిక కోర్టు ఆవరణలో శనివారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం కారణంగా తలకు బలమైన గాయాలై ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. హెల్మెట్ ధరించి వాహనం నడపడం వల్ల ప్రమాదం జరిగినా ప్రాణాపాయం బారి నుంచి బయట పడవచ్చన్నారు. సామాజిక సేవా దక్పథంతో హెల్మెట్ల పంపిణీకి ముందుకు వచ్చిన చింతలపూడి పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ మెంబర్ జి శ్రీనివాస్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కే జయరాజు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులకు సహకారం అందిస్తాం



కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న కృపామణి

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండలంలో తయారయ్యే చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులకు జిల్లా యంత్రాంగం తరుపున మరింత సహకారం అందిస్తామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హామీ ఇచ్చినట్లు మదర్‌థెరిస్సా మహిళా మండలి అధ్యక్షురాలు తోట కృపామణి విలేకరులకు తెలిపారు. ఏలూరులో శనివారం జిల్లా పరిశ్రమలు సమ్మిట్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో చిరుధాన్యాల ఆహార ఉత్పత్తిలో కనకాద్రిపురం ఆదర్శంగా నిలిచిందన్నారు. ౖగుడ్ హెల్త్ మిల్లెట్ ఫుడ్ బ్రాండ్‌తో చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులు తయారవుతున్న విషయం మరింత ప్రచారం చేయాల్సిందిగా సూచించారన్నారు. వాటిని తయారు చేస్తున్న తమను అభినందించి కలెక్టర్ కె.వెట్రిసెల్వి పురస్కారం అందజేసినట్లు కృపామణి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వికి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయ్‌రాజుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

ఉంగుటూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని క్రాఫ్ జిల్లా కో ఆర్డినేటర్ ఆర్. వినోద్‌కుమార్ అన్నారు. బాదంపూడిలో చైల్డ్ రైట్స్, చైల్డ్ మ్యారేజీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో శనివారం బాల్యవివాహాల నిరోధంపై ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ చిన్న వయస్సులో బాలికకు వివాహం చేస్తే రక్త హీనత, శారీరక సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. బాల్యవివాహాలు చేస్తే టోల్ ఫ్రీ నంబర్లు 112, 109 సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. ప్రతి గ్రామాన్ని బాల్య వివాహరహిత గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. బాల్యవివాహాలు వద్దు–చదువు ముద్దు నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

రేపటి నుంచి భీమడోలు రైల్వే గేటు మూత

భీమడోలు: భీమడోలు– పూళ్ల రైల్వే స్టేషన్ల మధ్య భీమడోలు రైల్వేగేట్ ట్రాక్ అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు తాత్కాలికంగా గేటు మూసివేస్తున్నట్లు సంబంధిత ఏలూరు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ తెలిపారు. గేటు మీదుగా రాకపోకలు సాగించేవారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వివరాలు ఇలా న్నాయి. జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న అరవపల్లి శివకోటేశ్వరరావు తన మనుమడు రాణా ఉదయ్‌తో కలిసి ఈ నెల 6వ తేదీన టూవీలర్‌పై వెళుతుండగా స్థానిక అన్‌లిమిటెడ్ రెస్టారెంట్ వద్ద వెనుక నుంచి ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో శివకోటేశ్వరరావు, రాణా ఉదయ్‌లకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు బాధితుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు శివకోటేశ్వరరావును స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడినుంచి గుంటూరు మణిపాల్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఈ ప్రమాదంపై శివకోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

జంగారెడ్డిగూడెం: రెండు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. ఎస్సై షేక్ జబీర్ కేసు తెలిపిన వివరాలివి. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన మజ్జి దుర్గారావు మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా, స్థానిక పద్మథియేటర్ సమీపంలో ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొంది. ఈ ఘటనలో దుర్గారావు తలకు తీవ్ర గాయమైంది. వెంటనే క్షతగాత్రుడు దుర్గారావును అతని కుమారుడు రామదుర్గా సందీప్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. సందీప్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కుక్కునూరు: మండలంలోని నాటుసారా తయారీ కేంద్రాలపై శనివారం కుక్కునూరు పోలీసులు దాడులు నిర్వహించారు. వేలేరు గ్రామ సమీపంలోని పాములేరు వాగు వద్ద నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో కుక్కునూరు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య సేవలు పునరుద్ధరించండి

దెందులూరు: జిల్లాలో అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కంటి వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు సేవలను పునరుద్ధరించాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి, ప్రధాన కార్యదర్శి కాటి సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా నాయకులు కొవ్వలిలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయడంతో ప్రభుత్వ వైద్యశాలల్లోనే కంటి వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేయడంతోపాటు కళ్లజోళ్లు అందించేవారని వారన్నారు. దీంతో పేద ప్రజలు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లే అవసరం తప్పిందని అన్నారు. ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కంటి వైద్య సేవలను నిలుపుదల చేశారని విమర్శించారు. కంటి వైద్య సేవల సౌకర్యం లేదని ఆస్పత్రుల వద్ద నోటీసులు పెడుతున్నారని, దీంతో పేదలు కంటి వైద్యానికి సంబంధించి కార్పొరేట్ వైద్యశాలలకు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లక తప్పడం లేదని వాపోయారు. ప్రైవేటు వైద్యంలో వేలాది రూపాయలు ఖర్చు కారణంగా అనేక మంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందరికీ ఉపయోగపడే కంటి వైద్య సేవలందించే పథకాన్ని కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయటం అత్యంత దుర్మార్గమన్నారు. ఉద్దేశపూర్వకంగా ప్రజలకు ఉపయోగపడే పథకాలను నిలుపుదల చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు చిన్నారులు, వృద్ధులతోపాటు ప్రతి ఒక్కరి కంటి వైద్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కంటి వైద్య పరీక్షలను పునః ప్రారంభించాలని డీబీఆర్‌కే చౌదరి, కాటి సుధాకర్ కోరారు.